క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో కొల్లాపురమ్మ అమ్మవారు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామం ఆర్డీటీ కాలనీలో శుక్రవారం కొల్లపురమ్మ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. గంగాజలం తెచ్చి అభిషేకించి పూజలు చేశారు. హోమం అనంతరం నవగ్రహాలు, కొల్లపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం కలశం ప్రతిష్ఠించి అమ్మవారికి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించి మహామంగహారతి ఇచ్చారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన పత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన వడ్డే హనుమంతప్ప (56) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రాజేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణసాయం కింద పదివేల రూపాయల నగదును మృతుడి భార్య నాగమణికి అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం పంచాయతీలోని ఓబగానిపల్లిలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన రూ.20 లక్షల నిధులతో గ్రామ సచివాలయం నుంచి గౌరసముద్రం ఆలయం వరకూ చేపట్టిన సీసీ రోడ్ల పనులకు శుక్రవారం సర్పంచ్ హరినాథ్, ఎంపీటీసీ బసప్ప, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనరాజ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ చెన్నకేశవులు, వార్డు మెంబర్ నాగరాజు, గంగన్న, నేసే ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

కూడేరు: కర్ణాటక మద్యాన్ని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం కూడేరులో కలగళ్ల రోడ్డు క్రాస్‌లో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కారు, జీపు డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశులు, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి నిధుల మంజూరు



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: మండల కేంద్రంలోని అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి నుంచి కేజీబీవీ దగ్గర ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ రోడ్డు ఏర్పాటుకు గృహ నిర్మాణ శాఖ తరపున రూ.4.98 లక్షలు నిధులు మంజూరయ్యాయి. శుక్రవారం ఎంపీపీ నారాయణ రెడ్డి భూమి పూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో రోడ్లు, మంచి నీటి, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవ, హౌసింగ్ ఏఈ శేఖర్, నాయకులు మంజునాథ్ రెడ్డి, రామాంజనేయులు, కొండా, చంద్రశేఖర్, శ్రీనివాసులు, అక్కులన్న, మల్లి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వతాతల కళ్లలో ఆనందం

- జనవరి ఒకటి నుంచి పింఛన్ రూ.3,000
- హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

రాయదుర్గం: మరో రెండు రోజుల్లోనే పింఛన్ల పండుగ రానుంది. కొత్త ఏడాది 2024 లో అడుగు పెట్టగానే అవ్వతాతల కళ్లల్లో ఆనందం నింపేలా సరికొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. జనవరి 1 నుంచి 8వ తేదీ వరకూ ఊరురా పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపట్టేందుకు అధికారులు షెడ్యూల్ సిద్ధం చేశారు. ఇందులో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లను భాగస్వామ్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ పింఛన్ కానుక మొత్తాన్ని ప్రతి ఏటా రూ.250 పెంచుకుంటూ పోతూ రూ.3 వేలకు చేర్చారు. ఈ మొత్తాన్ని వచ్చే నెల జనవరి 1 నుంచి అందించనున్నారు. దీంతో పేద వర్గాలన్నీ సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో ఇలా..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వృద్ధాప్య, వింతంతు, వీవర్స్, గీత కార్మిక, అభయాస్తం, ట్రాన్స్‌జెండర్స్, మత్స్యకార, ఒంటరి మహిళ, డప్పుకళాకారులు, అర్టిస్ట్, మోడికల్ ఇలా అనేక రకాల పింఛన్లు 1,11,855 ఉన్నాయి. వీరందరికీ రూ.3 వేల ప్రకారం వచ్చే నెల నుంచి రూ. రూ.3111.2 లక్షల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుంది. టీడీపీ హయాంలో 2014–19 వరకు చంద్రబాబు రూ. వెయ్యి మాత్రమే పింఛన్ అందించారు. 2019 ఎన్నికల ముందు సీఎం జగన్ పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో విధిలేని స్థితిలో కేవలం 2–3 నెలలు మాత్రమే రూ.2 వేలు పింఛన్ అందించి చంద్రబాబు చేతులు దులిపేసుకున్నారు. అప్పట్లో పింఛన్ తీసుకోవడానికి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గర్భిణులు, వ్యాధిగ్రస్తులు నానా అవస్థలు పడేవారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పింఛన్ అందిస్తూ నవశకానికి నాంది పలికారు.

మూడు నియోజకవర్గాల్లో పింఛన్ల వివరాలిలా

నియోజకవర్గం	మొత్తం పింఛన్లు	అందించే నగదు (రూ.లక్షల్లో)
రాయదుర్గం	37,968	1055.46
కళ్యాణదుర్గం	37,784	1055.34
ఉరవకొండ	36,103	1000.40

సంతోషంగా ఉంది



జనవరి ఒకటి నుంచి రూ.3,000 ఫింఛన్ ఇస్తారని వలంటీర్ తెలిపారు. జగన్ సీఎం అయ్యాకే ఈ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. జనవరి నుంచి రూ. 3 వేలు ఇవ్వనుండడం సంతోషంగా ఉంది.
– నాయకుల పద్మావతి, కోటవీధి, రాయదుర్గం

కష్టాలు తీరుతాయి



ప్రతి నెలా అందించే పింఛన్ సొమ్ముతో కొంత వరకైనా నా కష్టాలు తీరుతాయి. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వచ్చే నెల జనవరి నుంచి రూ.3 వేలు అందించనున్నారు. ఇది గౌరవ వేతనంగా భావిస్తాం. మంచిచేసే ఇలాంటి ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండాలి.
– మనియార్ మాలన్‌బీ, రాయదుర్గం

పండుగలా కార్యక్రమాలు



రాష్ట్ర ప్రభుత్వం రూ.2,750 నుంచి రూ.3,000కు పింఛన్ మొత్తాన్ని పెంచింది. వచ్చే నెల జనవరి నుంచి పెరిగిన ఫింఛన్‌తో కలిపి లబ్ధిదారులకు రూ.3,000 అందించేలా కార్యాచరణ చేపట్టాం. ఈ సందర్భంగా 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఊరూరా పండుగలా పింఛన్ పంపిణీ చేయనున్నాం. – నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ, పీడీ, అనంతపురం

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ రాణి సుష్మిత

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని లింగమనహళ్లి వద్ద సర్వే నెంబర్ 1–1 లో బీ ముస్తాక్‌హుసేన్ అనేపేరుపై స్టోన్ క్వారీ లీజు ఏర్పాటు కోసం శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్మన్నతో పాటు స్థానికులు పలు సమస్యలను ఆర్డీఓ తో పాటు ఎన్విరాన్‌మెంటల్ ఎగ్జిక్యూటర్ ఇంజినీర్ కిశోర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ క్రిష్టారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. క్వారీ యజమానులు నిబంధనలు పాటించడం లేదని, ఈ కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. యజమాని లాభాలతో పాటు తమ అవసరాలు కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యంతో పాటు తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ క్వారీ నిర్మాణం వల్ల పేదలకు హాని లేకుండా చూడాలన్నారు. ప్రతి విషయం క్షుణ్ణంగా అధ్యాయనం చేశాకే అనుమతులు ఇస్తామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘాలు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పప్పుశనగ, కందిలో పంటకోత ప్రయోగాలు



వజ్రకరూరులో పంటకోత ప్రయోగాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ పద్మజ

వజ్రకరూరు: మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. రైతులు లింగంశెట్టి వెంకటేష్, లింగారెడ్డి పొలాల్లోని పప్పుశనగ పంటలో ప్రయోగాలు నిర్వహించగా 0.280 గ్రాములు 0.550 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. అలాగే రైతులు ప్రతాప్‌రెడ్డి, చిన్న శర్మస్‌వలికి చెందిన కంది పంటలో ప్రయోగాలు నిర్వహించగా 2.590 కిలోలు, 1.050 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. పంటకోత ప్రయోగాలను ఏడీఏ పద్మజ, ఏఓ మధుకర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ జానమ్మ, ఎంపీఈఓ ప్రమీల, వీఏఏ సురేష్, రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



బెళుగుప్పలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం నియోజకవర్గ కోఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ పట్టణం, మండలంలో 20 జట్లకు వివిధ పోటీలు నిర్వహించామన్నారు. అలాగే గోళ్ల గ్రామంలో ఈఓఆర్‌డీ బాలాజీ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సర్వోత్తం, కోఆప్షన్ సభ్యుడు రెహ్మాన్, నాయకులు మోహన్ రెడ్డి, పోతేష్, రామలింగా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటోంది. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బెళుగుప్ప సచివాలయ పరిధిలోని వాలీబాల్ జట్లు పోటీ పడ్డాయి. మండలంలో మొత్తం 1,126 మంది క్రీడాకారులు 123 జట్లుగా ఏర్పడ్డాయని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. 2024 జనవరి 9 వరకూ గ్రామస్థాయి పోటీలు, 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ మండలస్థాయిలో పోటీలను నిర్వహించి ఉత్తమ జట్లను నియోజకవర్గ స్థాయికి పంపుతామని ఎంపీడీఓ, పీడీ రాజశేఖర్ తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి



చెక్కులందుకున్న మహిళలతో విశాలా ఫెర్రర్

కూడేరు: మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి చెందాలని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పిలుపునిచ్చారు. గత నెల 17న శ్రీవిశాల ఫెర్రర్ మహిళా కో ఆపరేటివ్ బ్యాంకును కూడేరులో ప్రారంభించారు. ఆర్డీటీ సంఘాల్లో ఉన్న మహిళలంతా రూ.500 చొప్పున చెల్లించి వాటాదారులుగా చేరారు. ఆ పొదుపు నుంచి తిరిగి మహిళలకు ఆమె రుణ సదుపాయం కల్పించారు. వారందరికీ శుక్రవారం చెక్కులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, సక్రమంగా చెల్లించాలని సూచించారు. వడ్డీ రూపంలో వచ్చే డబ్బును డిపాజిట్ మొత్తంలోకి కలిపి సభ్యులంతా వాటాగా పొందవచ్చన్నారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ క్రిష్టారెడ్డి, ఏటీఎల్ రామాంజనేయులు, డబ్ల్యూఆర్‌పీ హుసేన్ బీ, సీఓలు సిద్దప్ప, మధు, మహిళా బ్యాంకు బీఓడీలు పాల్గొన్నారు.

హైస్కూల్ ఏర్పాటుపై మంత్రి, జేసీకి కృతజ్ఞతలు



మంత్రి ఉషశ్రీచరణ్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయమని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం అనంతపురంలో మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి ఎంపీపీ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో హైస్కూల్ అప్‌గ్రేడ్ చేయడంతో నాలుగైదు గ్రామాల్లోని పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బూసప్ప, అయ్యన్న, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ విలేకరులతో మాట్లాడారు. 132 కేవీ ఓబుళాపురం విద్యుత్ లైన్ మార్పు చేసే పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లోని వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలి

బ్రహ్మసముద్రం: మండలంలో సంతే కొండాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. సమస్యను టీడీపీ మద్దతుదారు, సర్పంచ్ వనిత, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అనంతరం సచివాలయంలో సిబ్బందికి మహిళలు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై ఎంపీడీఓ దాసానాయక్ ను వివరణ కోరగా జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటుచేసి తాగు నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కొత్తూరు ఫారెస్టు సమీపంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన వీరాంజనేయులు తన వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం వచ్చాడు. పని ముగించుకుని సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తూరు ఫారెస్టు సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వాహనదారులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తలకు తీవ్రంగా గాయం కావడంతో వైద్యుల సూచన మేరకు బంధువులు అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని పార్వతీనగర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. కొద్ది కాలంగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. శుక్రవారం తీవ్ర కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

'సూపర్ 60' పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖ అధికారిణి శ్రీదేవి

ఉరవకొండ: అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలు, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్, ఆర్‌డీటీ సెట్‌లలో ప్రవేశం కోసం ఇచ్చే ప్రత్యేక శిక్షణ కోసం సూపర్ 60 పరీక్షలకు సంబంధించి వాల్‌పోస్టర్లను శుక్రవారం గుత్తి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిణి శ్రీదేవి ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అభయ ఫౌండేషన్, నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో ఏప్రిల్ మొదటి వారంలో 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 60 మంది అనంతపురం జిల్లా, 60 మంది సత్యసాయి జిల్లాల విద్యార్థులకు నిస్వార్థ, అభయ ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ తాడికొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెరిబ్రల్ పాలసీ సెంటర్ వార్షికోత్సవం



పిల్లలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

కూడేరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆర్డీటీ సెరబ్రల్ పాలసీ, మాట, వినికిడి లోపం పిల్లల సమ్మిళిత ప్రాథమిక పాఠశాల 21 వార్షికోత్సవం శుక్రవారం సిబ్బంది, పిల్లలు, వారి తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంస్థ లైఫ్ స్కిల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జులేఖ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సెలబ్రల్ పాలసీ, మాట, వినికిడి లోపమున్న పిల్లలను ఈ సెంటర్లో చేర్చుకుని ఎడ్యుకేషన్ పై శిక్షణ ఇచ్చి వారికి బంగారు భవిష్యత్తు అందించాలన్నదే ఆర్డీటీ లక్ష్యమన్నారు. అనంతరం పిల్లలు చేసిన డ్యాన్స్, క్లాసికల్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభకనబరిచిన పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉరవకొండ రీజనల్ డైరెక్టర్ క్రిష్టారెడ్డి, సెంటర్ నిర్వాహకుడు షణ్ముఖరావు, సిస్టర్లు గ్రేసమ్మ, శివానందమ్మ, ఆంథోమ, సిబ్బంది గీత, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కుందుర్పి: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 75వ వసంతాలు పూర్తయిన సందర్భంగా జనవరి 12, 13న జిల్లా కేంద్రంలో నిర్వహించే వజ్రోత్సవాలను విజయ వంతం చేయాలని ఆ శాఖ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో వజ్రోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిప్పేస్వామి, జిల్లా కన్వీనర్ చెన్నరాయప్ప, మండల అధ్యక్షుడు వై.రాజు, ప్రధాన కార్యదర్శి రేవన్న, నాయకులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి–ఎనుములదొడ్డి రహదారికి ఇరువైపులా కంప చెట్లను శుక్రవారం తొలగించారు. 18 కిలోమీటర్ల మేర రోడ్డు కంప చెట్లతో ఆవరించుకు పోవడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. స్పందించిన కళ్యాణదుర్గం ఎంపీపీ ఆంజనేయులు, కుందుర్పి ఎంపీపీ నాగరాజు సొంత ఖర్చులతో కంప చెట్లను తొలగించి ఉదారత చాటుకున్నారు. కంప చెట్లను తొలగించడంతో తెనగల్లు, తూముకుంట, ఎనుములదొడ్డి, బెస్తరపల్లి గ్రామాల ప్రజలతోపాటు వాహన చోదకులు ప్రజాప్రతినిధులను ప్రశంసించారు.

నేటి నుంచి ఇమాంషావలి ఉరుసు



హజరత్ ఇమాంషావలి సమాధి

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో ప్రఖ్యాతిగాంచిన హజరత్ ఇమాంషావలి ఉరుసు శనివారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు యూనుస్, మాబు తెలిపారు. శనివారం రాత్రి గంధంతో ఉరుసు వేడుకలు ప్రారంభమై.. ఆదివారం రాత్రి ఉరుసు, వేకువజామున షంషీర్ ఊరేగింపు, సోమవారం జియారత్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉరుసు కోసం నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు ఇమాంషావలిని ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఊరేగింపును తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

రూ.20 లక్షలతో నూతనంగా దర్గా నిర్మాణం

పురాతనమైన ఇమాంషావలి దర్గాను రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించినట్లు దర్గా ధర్మకర్త గంగలాపురం ఎం.ఫక్రుద్దీన్ తెలిపారు. భక్తుల విరాళాలతో దర్గాను పునఃనిర్మించామన్నారు. కొత్త దర్గాతోపాటు నలువైపులా మినార్‌లు, గుమ్మాజ్ నిర్మాణం చేశామన్నారు. అలాగే గుమ్మాజ్‌పై 3 కిలోల వెండితో తయారు చేసిన తాజ్ (కలశం)ను శుక్రవారం సంప్రదాయ ప్రకారం ప్రత్యేక ఫాతేహాలు చేయించి ఆ తర్వాత ప్రతిష్ఠాపన చేశారు. వేడుకలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎంపీ తలారి రంగయ్యను ఆహ్వానించామని ఆయన తెలిపారు.



నూతనంగా నిర్మించిన హజరత్ ఇమాంషావలిదర్గా